క్లుప్తంగా

అనుసూరికి మహానంది జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారం స్వీకరిస్తున్న అనుసూరి రాము

కాకినాడ కల్చరల్: స్థానిక ఎంఎస్ఎన్ చారిటీస్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు అనుసూరి రాముకు మహానంది జాతీయ పురస్కారం ప్రదానం చేశారు.తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభ సమావేశ మందిరంలో ఉగాదిని పురస్కరించుకుని మహానంది జాతీయ పురస్కారాలు–2023 ప్రదానోత్సవం ఆదివారం ఉదయం నిర్వహించి అనుసూరికి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ఆయనను కళాశాల కరస్పాండెంట్ పి.బాబు రావు, చైర్మన్ మల్లాడి కార్తిక్ నాయకర్, ప్రిన్సిపాల్ కె.అమరేశ్వరావు అభినందించారు.

అవగాహనతో ఆటిజం నయం



పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ బిందు మాధవి

బోట్‌క్లబ్: ఆటిజం వ్యాధి కాదని, అవగాహనతో వారిని సరైన మార్గంలో పెంచగలమని ప్రముఖ పిడియాట్రిక్ న్యూరాలజిస్ట్ బిందు మాధవి అన్నారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా రోటరీక్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో ఆదివారం ధన్య ఫంక్షన్‌హాల్‌లో ఆటిజంపై అవగాహన కల్పించారు. తల్లితండ్రులు సహనంతో వ్యవహరిస్తే పిల్లల్లో ఆటిజం త్వరగా నయమవుతుందన్నారు. ఆరంభ స్కూల్ ఫర్ స్పెషల్ చిల్డ్రన్ వ్యవస్థాపకురాలు శారద మాట్లాడుతూ అవగాహనా రాహిత్యంతో పిల్లలకు చికిత్సలు చేయించే కంటే తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ముఖ్యమని రోటరీ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ప్రముఖ హోమియో వైద్యులు సలాది సూర్య కిరణ్, ఆయుర్వేద వైద్యులు షహజాద్ ఆలీ మాట్లాడుతూ ఆటిజం పిల్లలకు వైద్య పరంగా అందించే సేవలు ఉపశమనాన్ని ఇస్తాయన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద, మాజీ గవర్నర్లు ఎల్.సత్యనారాయణన్, ఎం.వీరభద్రరెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ సేవలకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు



కుట్టు మెషీన్ అందజేస్తున్న లయన్ జిల్లా గవర్నర్ మంగతాయారు, బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ సేవలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని లయన్ జిల్లా గవర్నర్ ఎం.మంగతాయారు పేర్కొన్నారు. వాల్ ఆఫ్ సర్వీస్‌లో భాగంగా పేదలకు గృహోపకరణాలు అందజేశారు. లయన్స్ ఐ ప్రాజెక్టు ద్వారా కళ్లజోళ్లు, ట్రీగార్డులు, పేద మహిళకు కట్టుమిషన్, విద్యార్థికి రూ.25వేలు అందజేశారు. జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ, క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ ఎన్.మురళీకృష్ణ, కార్యదర్శి సుబ్రమ్మణ్యం, దంగేటి సతీష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కాండ్రకోటకు భక్తకోటి బారులు

- నూకాలమ్మ తల్లి దర్శనానికి తరలి వచ్చిన జన సందోహం





అమ్మవారి దర్శనానికి వేచియున్న భక్తులు. (అంతర చిత్రం) భక్తుల పూజలందుకుంటున్న నూకాలమ్మ తల్లి

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. కొత్త అమవాస్యను పురష్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ పోలీస్ బందోబస్తు కల్పించారు. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ చేసారు.

ఆ మార్గం సుగమం..

- ప్రమాదాల బారి నుంచి రక్షిస్తున్న అప్రోచ్
- వార్ఫురోడ్డుకు ప్రత్యామ్నాయం ఏర్పాటు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవతో సాకారం



నూతన అప్రోచ్ రోడ్డును వినియోగించుకుంటున్న వాహనచోదకులు

కాకినాడ క్రైం: ప్రమాదాల చింత ఒక్క నిర్మాణంతో సమసిపోయింది. నిత్యం రోడ్డు ప్రమాదాలకు ఆలవాలమైన స్థానిక వార్ఫ్ రోడ్డులో ప్రయాణాలు ఆరు నెలలుగా ప్రశాంతంగా సాగిపోతున్నాయి. వామ్మో వార్ఫు రోడ్డు.. అంటూ ప్రజలు భయపడే ఆ మార్గమే ఇప్పుడు ఒకే ఒక్క అప్రోచ్ నిర్మాణంతో సాధారణ రహదారిలా సురక్షిత సేవలందిస్తోంది.

వామ్మో వార్ఫు రోడ్డు..

నగరంలోని ప్రధాన మార్గాల్లో కీలకమైన వార్ఫురోడ్డు అంబేద్కర్ భవన్, పాతబస్టాండు, కోర్టుల సముదాయము, కలెక్టరేట్, జిల్లా పరిషత్, ఆర్‌డీవో కార్యాలయం, జీజీహెచ్ వంటి కీలక కేంద్రాలను అనుసంధానం చేస్తుంది. నిత్యం లక్షలాది ప్రజలు ఈ మార్గం గుండా ప్రయాణాలు సాగిస్తారు. అంతేకాక, యానం, రామచంద్రాపురం, ద్రాక్షారామ రహదారుల నుంచి వచ్చే భారీ వాహనాలు నగరానికి చేరాలన్నా, నగరం దాటి వెళ్లాలన్నా ఈ రోడ్డే కీలకం. ఇంతటి రద్దీ వల్ల నిత్యం ప్రమాదాలు సంభవిస్తూ పలుమార్లు మరణాలు నమోదయ్యేవి. పలుసార్లు మరణాలు కూడా సంభవించేవి. దీంతో చిన్నవాహనదారులు, ద్విచక్రవాహనాలు నడిపేవారు, సైకిలిస్టులు ఆ దారి గుండా ప్రయాణం అంటేనే భయపడిపోయేవారు.



అప్రోచ్ రోడ్డు వద్ద పోలీస్ గస్తీ

నూతన అప్రోచ్ రోడ్డు నిర్మాణం....

ఇక్కడి ప్రమాదాల ముఖచిత్రాన్ని నూతనంగా నిర్మితమైన శ్రీ రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ ఫ్రూటీ కుమార్ అప్రోచ్ రోడ్డు పూర్తిగా మార్చేసింది. ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తూ నగరంలోకి ప్రవేశించే ద్విచక్ర వాహనచోదకులకు ఎంతగానో సాంత్వన చేకూరింది. ఈ మార్గం ద్వారా దేవాలయం వీధి గుండా జగన్నాథపురం పరిసర ప్రాంత వాసులతో పాటు స్థానిక గ్రామాల ప్రజలు సురక్షితంగా నగరంలోకి ప్రవేశిస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవతో....

గత ప్రభుత్వ హయాంలోనే ఈ అప్రోచ్ ఏర్పాటుకు నాటి ఎమ్మెల్యే వనమాడి అదరాబాదరాగా ఆర్భాటం చేసేసినా ఆనక వదిలేశారు. అనంతరం జగన్నాథపురం వంతెన నుంచి దేవాలయం వీధిని అనుసంధానం చేసే అప్రోచ్ రోడ్డు నిర్మాణ బాధ్యత తను ఎంఎల్ఏ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి రూ.19.8 కోట్లు మంజూరు చేయించి పూర్తి చేయించారు. దీంతో ప్రమాదాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఆ వివరాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు
2019	88	6
2020	59	4
2021	97	7
2022 (ఆగస్టు దాకా)	79	5

వంతెనను 2022 సెప్టెంబర్ రెండున ప్రారంభించగా మార్చి 31, 2023 వరకు ఆరు నెలల వ్యవధిలో 11 ప్రమాదాలు మాత్రమే సంభవించడం గమనార్హం. ఈ అప్రోచ్ నుంచి కేవలం ద్విచక్ర వాహనాలు, చిన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వడం వాహనచోదకుల్లో ఆనందం నింపింది.

రద్దీ తగ్గింది



నూతనంగా నిర్మితమైన ఈ అప్రోచ్ నగర వాసులకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర చిన్న వాహనాలు మళ్లడం వల్ల వార్ఫు రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గింది. నూతన రోడ్‌లోకి భారీ వాహనాలను అనుమతించడంలేదు. అక్కడ ప్రత్యేక పోలీస్ పర్యవేక్షణ ఏర్పాటు చేశాం. ముఖ్యంగా జగన్నాథపురం, పరిసర ప్రాంత వాసులు, స్థానిక గ్రామాల నుంచి నిత్యం నగరానికి వచ్చే వారికి ఈ అప్రోచ్ ఎంతో సురక్షితం

– మొగలి వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ డీఎస్పీ, కాకినాడ

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సినిమా రోడ్డులోని అక్తా మసీదులో ఆదివారం సాయంత్రం ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి తనను ముస్లిం మైనార్టీలు వెన్నంటి ఉన్నారన్నారు. ముస్లిం పెద్దల విజ్ఞప్తి మేరకు త్వరలోనే మసీదు ప్రాంతంలో మదర్‌సా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మసీదు అధ్యక్షుడు అక్మల్ హుస్సేన్, సభ్యులు మంజూర్ అహ్మద్, ఎంఎస్ఎస్‌కె సాధిక్, దుర్రానీ, సంసుద్దీన్, తాజుద్దీన్, ఎండీ జకిరియా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్ ఖాన్, డైరెక్టర్లు జాఫర్ ఖాన్, ఖరీముల్లా, చోటు, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మానవీయతకు మారుపేరు సీఎం జగన్



రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
- రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కాకినాడ: కష్టాల్లో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించే గొప్ప మానవతావాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రైతుబజారు ఆవరణలోని శాంతి సంఘం క్రైస్తవ ప్రార్థనా మందిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఇటీవల మృతి చెందిన చర్చి ఆఫ్ పీస్ వ్యవస్థాపకుడు ఎం.రాజారావు కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత విలువలతో ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలిచిన పాస్టర్ రాజారావుతో ఉన్న అనుబంధాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తనకు వ్యక్తిగతంగా ఆత్మీయుడైన ఆయన అనారోగ్యంతో మృతిచెందారని, ఆ సమయంలో వైద్యం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారన్నారు. ఈ విషయాన్ని స్వయంగా సీఎం వద్దకు తీసుకువెళ్లి అభ్యర్థించగా ఆయన స్పందించి రూ.పది లక్షలు మంజూరు చేశారన్నారు. చర్చి ఆఫ్ పీస్ ప్రతినిధి జాషువా మాట్లాడుతూ కష్టాల్లో తమ కుటుంబానికి సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి అండగా నిలిచారని, వారికి తామెప్పుడు రుణపడి ఉంటామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ నల్లమిల్లి సుజాత, ఏఎంసీ డైరెక్టర్ కొంతం శ్రీనివాస్, స్థానిక పార్టీ నాయకులు నక్కా కుమార్, రాజారెడ్డి, సతీష్, వరలక్ష్మి, సారథి, తొంపల తాతారావు, బత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికార విభజనకే ఐసీడీఎస్ ప్రాజెక్టు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూరల్ నియోజకవర్గంలో నూతన పీఓ కార్యాలయం
- ఎంపీ వంగా గీతతో కలసి ప్రారంభం



రూరల్ ప్రాజెక్ట్ వద్ద గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ గీత తదితరులు

కాకినాడ రూరల్: అధికార వికేంద్రీకరణలో భాగంగా నియోజవర్గంలో ప్రత్యేకంగా సమగ్ర శిశు అభివృద్ధి పథక అధికారిణి కార్యాలయం (ఐసీడీఎస్ ప్రాజెక్టు) ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. సర్పవరంలో ఎంపీ వంగా గీతతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కన్నబాబు ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. పోషణ్ పక్వాడను పురస్కరించుకుని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మెరుగైన పాలనకు వీలుగా సీఎం జగన్ జిల్లాను విభజించారని ఆయన పేర్కొన్నారు. సామర్లకోట, తాళ్లరేవు ఐసీడీఎస్‌ల పరిధిలో ఉన్న నియోజకవర్గ అంగన్‌వాడీ సెంటర్లకు ప్రత్యేక ప్రాజెక్టు ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కాకినాడ రూరల్, కరప మండలాల్లోని 205 అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. త్వరలో అర్బన్ డివిజన్లను చేరుస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మెరుగ్గా పనిచేసి మహిళలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. అంగన్ వాడీ సెంటర్లకు దశలవారీగా శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ ప్రాజెక్టుకు గ్రామ నాయకుడు పుల్ల చందు, సర్పంచ్ శీలం చిన్నా భవనం చూపారన్నారు. 2023ను అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని వీటి ద్వారా ఆరోగ్యం కలుగుతుందన్నారు. సీడీపీఓలు జీవీ రమణ, పూర్ణిమ, పీడీ కార్యాలయ నోడల్ అధికారి లక్ష్మి, సూపర్‌వైజర్లు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీలు గోపుశెట్టి పద్మజ బాబ్జీ, పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం చిన్నా, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీలు సారా రాజేష్, గుత్తుల శ్రీనివాస్, కాకి సురేష్, తోటకూర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పుట్టిళ్లు అంగన్‌వాడీ కేంద్రాలు : ఎంపీ గీత

అంగన్‌వాడీ కేంద్రం మహిళలకు పుట్టింటి వంటిదని ఎంపీ గీత పేర్కొన్నారు. ఐసీడీఎస్ వ్యవస్థ వల్ల మహిళలకు పోషకాహారం లభిస్తోందన్నారు. తల్లీ బిడ్డలకు మెరుగైన ఆరోగ్యం కోసం సరైన పోషక విలువల ఆహారాన్ని సక్రమంగా అందివ్వాలని ఆమె కోరారు. పండంటి బిడ్డకు జన్మనిచ్చే వరకు గర్భిణులను కంటికి రెప్పలా చూసుకోవాలని అంగన్‌వాడీలకు ఎంపీ పిలుపునిచ్చారు.

10వ తరగతి పరీక్షలకు ఆరు కేంద్రాలు

- హాజరు కానున్న 951 మంది విద్యార్థులు

కరప: మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాసేందుకు ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి తెలిపారు. కరపలో ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆరు కేంద్రాల్లో 951 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తున్నట్టు ఆమె చెప్పారు. వీరిలో కరప హైస్కూలులో ఏర్పాటు చేసిన ఎ, బి కేంద్రాల్లో కరప, అరట్లకట్ట, నడకుదురు ఉన్నతపాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 397 మంది పరీక్షలు రాస్తారన్నారు. పెద్దాపురప్పాడు కేంద్రంలో పెద్దాపురప్పాడు, జగన్నాథగిరి హైస్కూళ్ల విద్యార్థులు 117 మంది, వేములవాడ కేంద్రంలో 52 మంది, వేళంగి కేంద్రంలో వేళంగి, కూరాడ, నరసాపురపేట హైస్కూళ్ల విద్యార్థులు 179 మంది, గొర్రిపూడి కేంద్రంలో గొర్రిపూడి, గురజానాపల్లి, వేమవరం హైస్కూలు విద్యార్థులు 206 మంది పరీక్షలు రాయనున్నారు. అన్ని గదుల్లో బల్లలు, తాగునీటి సౌకర్యం తదితర వసతులు కల్పించామన్నారు. సీఎస్‌లు యు.మాచిరాజు, ఏఎస్ఎస్‌జీ భవాని, ఎస్.ఉమ, కె.భారతి, ఎంవీవీ గోపాలరావు, ఎం.వేణుగోపాలరావు డీఓలతో కలసి పరీక్షలు నిర్వహిస్తారని ఎంఈఓ వివరించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

బాలాజీచెరువు: స్థానిక గుడారిగుంట మున్సిపల్ ఉన్నత పాఠశాల పదో విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు పరీక్ష సామాగ్రి అందజేసి పలు సూచనలు, మెళకువలు తెలియజేశారు. పాఠశాల హెచ్ఎం వై.శ్రీనివాస్, విష్ణుచక్రం, సురేష్‌కుమా పాల్గొన్నారు.

మెకానిక్‌లకు అండగా ఉంటాం



అసోసియేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మెకానిక్ సోదరులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత తెలియజేశారు. సర్పవరంలో స్కూటర్స్ అండ్ మోటార్ సైకిల్స్ రిపేరింగ్ ఓనర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని ఆదివారం గ్రామ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మెకానిక్‌లు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రభాకరరావు, పుల్ల కోటేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ (చిరంజీవి), ఉపాధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, నాయకులు వేణుగోపాలరావు, రాము, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ సేవలు నిస్వార్థమైనవి

- రాష్ట్ర చీఫ్ విప్ ముదునూరి



సభలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్‌రాజు, పరిషత్ అధ్యక్షులు రామకృష్ణ భాస్కరరాజు తదితరులు

కాకినాడ కల్చరల్: క్షత్రియ పరిషత్ సేవలు నిస్వార్థమైనవని నరసాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని క్షత్రియ పరిషత్ సమావేశపు మందిరంలో పరిషత్ నూతన అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణ భాస్కరరాజు (బుజ్జి) ప్రమాణ స్వీకార సభ ఆదివారం జరిగింది. పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతలపాటి వెంకటపతిరాజు జ్యోతిప్రజ్వలన చేశారు. భాస్కరరాజు మాట్లాడుతూ క్షత్రియులకు నిస్వార్థంగా సేవ చేస్తానని అన్నారు. విశిష్ట అతిథి వెంకటపతి రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సత్కళావాహిని అధ్యక్షులు, గోపాల నర్సరాజు, చింతలపాటి వెంకటపతిరాజు తదితరులను సత్కరించారు. అనంతరం పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణ భాస్కరరాజును ఘనంగా సత్కరించారు. చైతన్య విద్యా సంస్థల అధినేత కెవీవీ సత్యనారాయణరాజు, పరిషత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణం హర్షణీయం



ఎమ్మెల్యే కన్నబాబును సత్కరిస్తున్న వాకలపూడి శ్రీనివాస్‌నగర్ వాసులు

కాకినాడ రూరల్: వాకలపూడిలో సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా వాకలపూడిలో ఇటీవల పర్యటించిన ఎమ్మెల్యే కన్నబాబుకు అక్కడి సమస్యలపై స్థానికులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ మేరకు స్పందించిన ఆయన గడపగడపకూ కార్యక్రమాల్లో వచ్చిన సమ్యల పరిష్కారానికి మంజూరైన నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. ఆదివారం గడపగడపలో సంక్షేమం కథనం సాక్షిలో రావడంతో వాకలపూడి శ్రీనివాస్‌నగర్‌కు చెందిన నల్లా శ్రీను, గంటా సతీష్‌కుమార్, శ్రీవల్లీ, యాల్ల సత్యనారాయణ, రవి కుమార్, రాజ్‌కుమార్, లక్ష్మి, గంగాభవానీ, రాము, జయలక్ష్మి తదితరులు ఎమ్మెల్యే కన్నబాబును రమణయ్యపేట క్యాంప్ కార్యాలయంలో కలసి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



యండమూరులో మట్టలతో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

కాకినాడ కల్చరల్: నగరంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం నిర్వహించారు. రామారావుపేట లోని సెయింట్ జోన్స్ లూథరన్ చర్చికి చెందిన సంఘస్తులు చర్చి ఫాదర్ రెవరెండ్ అశోక్ కుమార్, చైర్మన్ డేవిడ్‌శామ్యూల్ ఆధ్వర్యంలో ఈత కొమ్మలు చేతపట్టి ఊరేగింపు చేశారు.

కరపలో క్రైస్తవుల ర్యాలీలు..

కరప: నడకుదురు క్రైస్ట్ బిలీవర్స్ చర్చి ఫాదర్ రెవరెండ్, మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ మేడపాటి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు జరిపారు. యండమూరు, పెనుగుదురు, కరప, వేళంగి, గొర్రిపూడి తదితర గ్రామాల్లో పిల్లలు ఊరేగుతూ చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు, డాక్టర్ జె.పాల్‌ప్రసాద్, డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, డాక్టర్ డి.ఏసురత్నం, పి.సత్యప్రసాద్, రెవరెండ్ కె.ఆనంద్‌బాబు, రెవ.ఐ.జాన్ సూర్యప్రకాష్, డాక్టర్ పి.సామ్యూల్‌రాజు తదితరలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మరో ఐదుగురికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో ఆదివారం మరో ఐదుగురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. బాధితుల్లో 9, 10, 14 ఏళ్ల ఇద్దరు బాలురు, ఓ బాలికతో పాటు 22, 23 ఏళ్ల ఇద్దరు యువతులు ఉన్నారు. వీరిలో ఇద్దరు పేకేరు గ్రామానికి చెందిన వారు కాగా, ఒకరు పెద్దాడకు చెందిన వారు. ఓ బాలికది కాకినాడ. బాధితుల్లో ఓ యువతి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల విద్యార్థిని. వీరంతా ప్రస్తుతం ఐసోలేషన్‌లో ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. శనివారం సేకరించిన 79 నమూనాలను పరీక్షిస్తే తాజా ఫలితం వెలువడింది.

అంబేడ్కర్ జయంతికి మద్యం విక్రయాలు వద్దు

కాకినాడ సిటీ: అంబేడ్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14న మద్యం విక్రయాలు నిలిపివేయాలని జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ సమావేశం తీర్మానించింది. ఆదివారం సాయంత్రం కాకినాడ యూటీఎఫ్ హోంలో జన విజ్ఞానవేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ సమావేశం అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. దీనిపై కలెక్టర్‌కు, ఎక్సైజ్ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. వివిధ సంఘాల నాయకులు జి బేబీరాణి, పిట్టా వరప్రసాద్, మోతా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుండపోతగా వర్షం



కల్పనా సెంటర్‌లో గాలికి నేలకొరిగిన చెట్టు కొమ్మ

కాకినాడ రూరల్: మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుమారు గంట పాటు కురిసిన వర్షంతో సర్పవరం, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, తదితర గ్రామాల్లో రోడ్లు, పల్లపు ప్రాంతాలు నిండిపోయాయి. జనజీవనం స్తంభించింది. 49వ డివిజన్ రామ్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. అనంతరం వైఎస్సార్ సీపీ మహిళా నేత జమ్మలమడుగు నాగమణి తదితరులు, స్థానికులతో కలిసి సహాయ కార్యక్రమాలు చేపట్టారు.



కరపలో కుండపోతగా కురుస్తున్న వర్షం

సేద తీరిన ప్రజలు.. ఆందోళన చెందిన రైతులు..

కరప: నిప్పులు చెరుగుతున్న వేసవిలో ఆదివారం మధ్యాహ్నం వాతావరణం మారి మబ్బులతో చల్లని గాలులు వీయడంతో జనం సేదతీరారు. ఒక్కసారిగా చీకటి వాతావరణం ఏర్పడిన కొద్ది సేపటికే 40 నిమిషాల పాటు కుండపోతగా వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల్లో ఉప్పు రాశులు వర్షానికి దెబ్బతిన్నట్టు రైతులు తెలిపారు. పెదకొత్తూరు, వేములవాడ, వలసపాకల, కూరాడ తదితర గ్రామాల్లో తీసిన ఇటుకలు తడిపోయి నష్టపోయినట్టు ఇటుక బట్టీల యజమానులు తెలిపారు. దాళ్వాపంట ఈనికదశలో ఉందని, వర్షం వల్ల సాగునీటి ఎద్దటి తొలగిందని రైతులు అంటున్నారు. రబీపంట చేతికందాలంటే వరుణుడు కరుణించాలని రైతులు భగవంతున్ని ప్రార్థిస్తున్నారు.



వాకలపూడి సంతోష్‌నగర్‌లో సిమెంట్ రోడ్డుపై నిలచిన నీరు

నగరంలో విరిగిపడిన చెట్ల కొమ్మలు

బోట్‌క్లబ్: అకాల వర్షంతో నగర ప్రజలు వేసవి ఉక్కపోతల నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఈదురు గాలుల వల్ల పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కారణంగా కల్పన సెంటర్, శ్రీనగర్, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. సుమారు అరగంటకుపైగా హోరున వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్డుపైన నిలిచింది. దీంతో వాహనచోదకులు అవస్థ పడ్డారు.